క్లుప్తంగా

రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన కమిషనర్

కమలాపురం: కమలాపురం పట్టణ పరిధిలోని అక్సా నగర్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ, తాగు నీటి పైప్‌లైన్ పనులను నగర కమిషనర్ రాముడు పరిశీలించారు. సోమవారం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా,డ్రైనేజ్ కాలువలకు అనుసంధానంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే క్రాస్ రోడ్డు నుంచి జరుగుతున్న రోడ్డు డివైడర్, బ్యూటిఫికేషన్ పనులను ఆయన పరిశీలించారు. ప్రజల సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని, త్వరలోనే ఈ పనులన్నీ పూర్తి అవుతాయని ఆయన తెలిపారు. కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి, 6వ కౌన్సిల్ ఇన్‌చార్జ్ గౌస్‌మోదీన్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది రాము తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

పులివెందుల టౌన్: నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీటి సంరక్షణ అనగా నీటిని సమర్థవంతంగా ఉపయోగించడం, కూరగాయలు, పండ్లను శుభ్రపరచిన నీటిని మొక్కలకు వాడవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు నీటిని సంరక్షిద్దాం అనే నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఓ డాక్టర్ యు.శ్రీనిత, వైస్ ప్రిన్సిపల్ ఎల్.సుధీక్, డాక్టర్ సి.బాలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తగ్రూపు పరీక్షలు

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పీఓ డాక్టర్ ప్రత్యూష, శ్రీనిత స్థానిక అహోబిలాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రక్త గ్రూపు పరీక్షలు నిర్వహించారు.

సస్యరక్షణ చర్యలు ముఖ్యం



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం: వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ నరసింహా రెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురంలో సాగు చేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగుల వల్ల జరుగుతున్న నష్టాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతలవి స్వార్థ రాజకీయాలు

పులివెందుల టౌన్ : టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తన స్వార్థ రాజకీయాలకోసం తన పై.. అధికారులపై లేనిపోని నిందలు వేయడం సరికాదని మాజీ కౌన్సిలర్ కొండ్రావ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను కౌన్సిలర్ పదవికి ఫిబ్రవరి 21వతేదీన రాజీనామా చేసిన విషయం తెలుసుకోకుండా టీడీపీ ఎమ్మెల్సీ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. తప్పుడు స్టేట్‌మెంట్లు ఇచ్చి అధికారుల గౌరవాన్ని అగౌరవ పరచవద్దని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి హితవు పలికారు.

టీడీపీ, జనసేన ఓటమి ఖాయం

పులివెందుల రూరల్: రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు చిత్తుగా ఓడి పోవడం ఖాయమనివైఎస్సార్ సీపీ యూత్ నాయకులు రామ్ లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ప్రశాంత్ కిషోర్‌లు అబద్దాలు చెప్పడంలో ప్రపంచ ఛాంపియన్లు అని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు గెలిచే అవకాశం ఉంటే పవన్ కళ్యాణ్‌తోను, బీజేపీతో ఎందుకు పొత్తు పెట్టుకున్నారో చెప్పాలన్నారు.

ఈ క్రాప్ జాబితా తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

లింగాల: మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో రబీ 2023–2024 ఈ క్రాప్ పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ, గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. అందులో భాగంగా సోమవారం మండలంలోని ఇప్పట్ల, కామసముద్రం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో జరుగుతున్న గ్రామ సభ, పంట నమోదు జాబితాను పరిశీలించారు. అర్హుల జాబితాను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించామన్నారు. జాబితాలపై రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరణ కోసం రైతు భరోసా కేంద్రాలలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.

సంక్షేమకర్తను ఆదరించండి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



సీకేదిన్నె.. ప్రజలకు సంక్షేమ పథకాలను తెలియజేస్తున్న జెడ్పీటీసీ నరేన్

వీరపునాయునిపల్లె: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి..అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆదరించాలని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యన్.పాలగిరి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు ప్రస్తుతం అధికారంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించడంతో పాటు రానున్న ఎన్నికల్లో మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేయాలని ఓటర్లను కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన కొనసాగిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. చంద్రబాబును మరోసారి ఇంటికే పరిమితం చేసేందుకు సిద్ధంగా ఉండాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచు వెంకటసుబ్బన్న, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ విజయకుమారి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, గురివిరెడ్డి, చెంద్రాయుడు, మునిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగభూషణం, ఓబులేసు,రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మొయిళ్లచెరువులో .. మండలంలోని మొయిళ్ల చెరువు గ్రామంలో మంగళవారం ఉదయం 6.30గంటలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

చింతకొమ్మదిన్నె: అభివృద్ధిని చూసి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు పి.నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గడ పగడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పి. రవీంద్రనాథ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలందరికీ తిరిగి సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు చేసింది ఏమీ లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే తిరిగి జన్మభూమి కమిటీల చుట్టూ పథకాల కోసం చెప్పులు అరిగేలా ప్రజలు తిరగాల్సి వస్తుందన్నారు. మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కష్టయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు గజ్జల శ్రీరామ్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, సర్పంచులు వద్దిరెడ్డి సురేంద్ర రెడ్డి,లక్ష్మీనారాయణ రెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు ప్రసాద్ రెడ్డి, మునయ్య బీసీ నాయకులు వేణుగోపాల్, ఎస్సీ సెల్ నాయకులు మాతంగి సుబ్బరాయుడు, అట్లూరి సుబ్బరాయుడు, శ్రీనివాసులు, అధ్యక్షుడు గజ్జల ఈశ్వర్ రెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు సిద్దు, మాజీ ఎంపీటీసీ హరి కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ లకిరెడ్డి రమణారెడ్డి, నీలకంఠ రెడ్డి, దుద్దికుంట రామచంద్రారెడ్డి, అయ్యప్ప పాల్గొన్నారు.

నవరత్నాల ఇళ్ల పట్టాలు పంపిణీ



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల : రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మల సొంతింటి కల నెరవేర్చిన ఘనత మన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎర్రగుంట్ల మండలం, పట్టణ పరిధిలోని నవరత్నాలలో భాగంగా పేదలందరికీ మంజూరైన ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు గతంలో టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇళ్లు ఇస్తామని చెప్పి పిచ్చుక గూళ్లు మాదిరిగా టిడ్కో ఇళ్లను నిర్మించారన్నారు. అలాగే గత టీడీపీ పాలనలో యర్రగుంట్లలో అభివృద్ధి జరగలేదన్నారు. మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిందన్నారు. ఎన్నో ఏళ్ల అక్కచెల్లెమ్మల సొంతింటి కలను నెరవేర్చారన్నారు. దేవగుడి సోదరులు తమ స్వార్థం కోసం యర్రగుంట్లను మున్సిపాలిటీ చేసి అభివృద్ధి చేయకుండా పన్నుల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేదల సంక్షేమ కోసం పనిచేస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రామక్రిష్ణయ్య, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ జాషువా, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపిటీసీ సభ్యులు మండల, మున్సిపల్ అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పాలనకు కేరాఫ్ సీఎం జగన్

అభివృద్ధి , సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని , బడుగు బల హీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్రంలో ఆయన ప్రవేశ పెట్టిన పథకాలే అందుకు నిదర్శనమని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎర్రగుంట్ల మండల పరిధిలోని వైకోడూరు గ్రామంలో మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డితో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి, ఉపమండలాధ్యక్షులు మల్లు వెంకటమోహన్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్న లక్ష్యం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఆగకుండా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేయడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మైలవరం మండలపరిధిలోని వేపరాల గ్రామంలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంట్‌ను మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు భీమునిపల్లె రామయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు అలిశెట్టి కుమార్, శ్రావణి, చేరెడ్డి చెన్నకేశవ రెడ్డి, సుధాకర్, సుబ్బరాయుడు,రమణ, అశోక్, కాట వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేము సిద్ధం..మా బూత్ సిద్ధం



మేము సిద్ధం..మా బూత్ సిద్ధంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్ తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక మిస్సమ్మ బంగ్లా సచివాలయ పరిధిలోని118,119 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి సోమవారం మేము సిద్ధం..మా బూతు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ కన్వీనర్లు హాల్ గంగాధర్ రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిషోర్ పాల్గొని బూత్ కమిటీలోని కన్వీనర్లకు, బూత్ కమిటీ సభ్యులకు ఎన్నికల్లో చేయాల్సిన విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య, బ్యాటరీ ప్రసాద్, జయ, నవీన్, శేఖర్, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెండ్లిమర్రి: మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ పంచాయితీలోని సోగాల్‌పల్లె గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జెసీఎస్ మండల కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి,సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి,శ్రీనువాసులురెడ్డి పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయండి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సరస్వతి

కమలాపురం: మండలంలోని చేసిన ఈ–క్రాప్ బుకింగ్ అన్ని ఆర్‌బీకేలలో ప్రదర్శించామని, రైతులు సరి చూసుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని మండల వ్యవసాయాధికారిణి సరస్వతి తెలిపారు. సోమవారం మండలంలోని టి.చదిపిరాళ్ల ఆర్‌బీకేలో ఆమె రైతులతో మాట్లాడారు. మండలంలోని 20వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారన్నారు. ఇందులో 10895 ఏకరాల్లో శనగ పంట, 8233 ఏకరాల్లో మినుము పంట, 690 ఏకరాల్లో వేరుశగన, 76 ఏకరాల్లో పెసలు, 60 ఏకరాల్లో జొన్న, 50 ఏకరాల్లో ఉలవలు, 40 ఏకరాల్లో కొర్రలు, 481 ఏకరాల్లో వరి, 320 ఏకరాల్లో నువ్వు పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేశామన్నారు. పంట నమోదు జాబితాను ప్రతి ఆర్‌బీకేలో ప్రదర్శించామన్నారు. ఈ నెల 7న తుది జాబితా తయారు చేస్తామన్నారు. తుది జాబితా విడుదల చేసిన తర్వాత ఎలాంటి మార్పులు చేయడానికి అవకాశం ఉండదన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అసత్యపు ఆరోపణలపై చర్చకు సిద్ధం



మాట్లాడుతున్న మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె: కమలాపురం మండలం లేటపల్లె గ్రామానికి చెందిన కొవ్వూరు రామాంజనేయులు చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగాలు ఇప్పిస్తా, గనుల్లో వాటాలిప్పిస్తానంటూ తాను లక్షల రూపాయలు వసూళ్లకు పాల్పడినట్లు చేస్తున్న ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కడప కలెక్టరు కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని 15లక్షల రూపాయలు తీసుకొని మోసం చేశానని తనపై తప్పుడు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. తనకు డబ్బులు ఇచ్చినట్లు ఏవైనా ఆధారాలు ఉంటే చూపించినా, కాణిపాకంలో ప్రమాణం చేసినా చెల్లించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలియజేశారు. రామాంజనేయులు అనే వ్యక్తి తెలుగుదేశం పార్టీకి కార్యకర్త , పుత్తా నరసింహారెడ్డికి సంబంధించిన సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మెన్ రామచంద్రారెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం డైరెక్టర్ గంగిరెడ్డి, అడవిచెర్లోపల్లె మాజీ ప్రెసిడెంటు సాంబశివారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ భద్రతా దినోత్సవాలు



ఆర్టీపీపీలో భద్రత దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో సోమవారం 53వ జాతీయ భద్రత దినోత్సవ సంబరాలు సీఈ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్టీపీపీలోని ఫైర్‌స్టేషన్ నుంచి సర్వీస్ బిల్డింగ్ వరకు ర్యాలీని నిర్వహించారు. సీనియర్ పర్యవేక్షణ అధికారి సోమశేఖర్ రెడ్డి , రవికుమార్, పద్మావతి, డీఈఎఫ్ సిద్దయ్య, సేఫ్టీ అధికారి సంతోష్‌కుమార్, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాధాక్రిష్ణ, ఆర్ఐ రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లులు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

జమ్మలమడుగు: పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. సోమవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇసుక క్వారీల నుంచి మాత్రమే ఇసుకను రవాణా చేసుకోవాలని.. ఎక్కడ పడితే అక్కడ ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలను తీసుకోవాలని సూచించారు. సీజ్ చేసిన వాహనాలను కడప మైన్స్ అధికారులకు రెఫర్ చేసినట్లు వివరించారు.

క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే గుర్తింపు



క్రీడాకారులకు నగదు బహుమతులు అందిస్తున్న నాగేళ్ల సాంబశివారెడ్డి తదితరులు

వేముల: గ్రామీణ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల ఇంచార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి పేర్కొన్నారు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు ఈ పోటీల్లో గెలుపొందిన కబడ్డీ క్రీడాకారులకు నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గ్రామీణ స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో గెలుపొందిన ఎంతోమంది క్రీడాకారులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఇప్పటినుంచే క్రీడలలో రాణించి ఆ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కమిటీ విన్నర్స్ జట్టుకి నాగేళ్ల సాంబశివారెడ్డి 15 వేల రూపాయలు, జెడ్పీటీసీ కే వెంకట బయపు రెడ్డి పది వేల రూపాయలు, మూడు నాలుగు స్థానాల్లో నిలిచిన కబడ్డీ జట్లకు ఎంపీపీ చల్ల గంగాదేవి 5000 రూపాయలు చొప్పున అందజేశారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ వైయస్సార్ సీపీ నాయకులు వెంకటనారాయణ మండల ఉపాధ్యక్షులు నరసింహా రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

జగనన్నకు లక్షకు పైగా ఓట్ల మెజారిటీ రావాలి



తిమ్మారెడ్డిపల్లెలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు, పార్టీ నేతలు

చక్రాయపేట: అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తూ సంక్షేమ పథకాలతో ప్రజలను ఆర్థికంగా బలపడేలా బటన్లు నొక్కి ఆదుకున్న ముఖ్యమంత్రి జగనన్నను వచ్చే ఎన్నికల్లో లక్ష ఓట్ల పై చిలుకు మెజారిటీతో గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు శివ ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల సమన్వయకర్త ఓబుళరెడ్డితో కలసి ఆయన కె.ఎర్రగుడి, దళితవాడలతో పాటు చక్రాయపేట పంచాయతీలోని తిమ్మారెడ్డి పల్లెల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు హరి శేఖర నాయుడు,హర్షాద్,మండల ఉపాధ్యక్షుడు గపూర్, శ్రీనివా సులు,ప్రభాకరరెడ్డి,గంగిరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, చంద్ర, బాబు,రమణారెడ్డి,మను,మధు,బాబావల్లి పాల్గొన్నారు.

కన్యతీర్థంలో ఏర్పాట్ల పరిశీలన



కన్యతీర్థంలో పర్యటించిన డీఎస్పీ

జమ్మలమడుగు: శివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని కన్యతీర్థంలో జరుగుతున్న ఏర్పాట్లను డీఎస్పీ యశ్వంత్ పరిశీలించారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక ఆలయ సిబ్బందితో కలిసి మాట్లాడారు. ఈ నెల 8వతేదీ శివరాత్రి పురస్కరించుకుని వచ్చే భక్తుల భద్రత, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం డీఎస్పీ యశ్వంత్ మాట్లాడుతూ ఆలయా ల ఆవరణలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన కఠిన చర్యలను తీసుకోవటానికి వెనుకాడమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేవీకే సేవలను రైతులకు చేరువ చేయాలి

> తిరుపతి వ్యవసాయ పరిశోధన కేంద్ర సహాయ పరిశోధన సంచాలకులు రమణ

కడప అగ్రికల్చర్: కృషి విజ్ఞాన కేంద్రం సేవలను రైతులకు మరింత చేరువ చేయాలని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ రమణ పేర్కొన్నారు. సోమవారం కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశంతోపాటు ఏరువాక కేంద్రం జిల్లాస్థాయి సమన్వయ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ, ఆధునిక వంగడాల వల్ల ఉత్పాదకత పెరిగిందన్నారు. కానీ పెరుగుతున్న జనాభా వలన మనపైన భారం పెరిగిందన్నారు. తగ్గుతున్న భూసాగు విస్తీర్ణంలో ఎక్కువ ఉత్పాదకతను పెంచాలన్నారు. గుంటూరు ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప విస్తరణ సంచాలకులు డాక్టర్ ముకుందరావు మాట్లాడుతూ జిల్లాలో వివిధ పంటల వైవిధ్యం చాలా మారిందని అందుకు అనుగుణంగా అన్ని రకాల పంటలలో పరిశీలనను, ప్రదర్శనలను సాంకేతిక కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. చిరుధాన్యాలను ప్రోత్సహించడంలో కృషి విజ్ఞాన కేంద్రం చేసిన కృషికి జాతీయ స్థాయి అవార్డు రావడం అభినందనీయం అన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య కేవీకే సాధించిన ప్రగతి గురించి వివరించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్తలు 2023–24 సంవత్సరంలో చేపట్టిన క్షేత్ర పరిశీలనలు, ప్రదర్శనలతోపాటు ఇతర కార్యక్రమాలను వివరించారు. అలాగే చేపట్టబోయే కార్యచరణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధశాఖ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, ప్రశాంతి, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డితోపాటు రైతులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను కాపాడాలి

కడప సెవెన్‌రోడ్స్ : జువారి సిమెంటు పరిశ్రమ ద్వారా వచ్చే దుమ్ము, ధూళి వల్ల ఎర్రగుంట్ల మండలంలోని వలసపల్లె, తుమ్మలపల్లె గ్రామాల్లో చీనీ పంట పూత, పిందె రాలిపోయి దెబ్బతింటోందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తెలిపారు. సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. సుమారు 200 ఎకరాల్లో చీనీ పంట దెబ్బతింటోందన్నారు. కాలుష్య నియంత్రణ, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. కాలుష్యాన్ని నియంత్రించి రైతుల పంటలు, ఆరోగ్యాలను కాపాడాలని కోరారు.

వివాదాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్నడీఎస్పీ షరీఫ్



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

చెన్నూరు : ప్రజలు గ్రామీణ ప్రాంతాలలో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కడప డీఎస్పీ షరీఫ్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లె ఎంపీపీ పాఠశాలలో సోమవారం రాత్రి ఉప్పరపల్లి గ్రామపంచాయతీ ప్రజలకు శాంతియుతంగా ఓటు హక్కు వినియోగం, గ్రామాలలోని చిన్నచిన్న గొడవలు దానిపై వచ్చే సమస్యల గురించి అవగాహన కల్పించారు. పచ్చని పల్లెల్లో ఆ పార్టీ ఈ పార్టీ అని సమస్యలు పెంచుకోకుండా అందరూ సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని ఎలాంటి సమస్యలకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన గ్రామస్తులకు సూచించారు, ఏవైనా సమస్యలే ఉంటే మీ గ్రామానికి ఏఎస్ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బయ్య, వీఆర్వోలు అందుబాటులో ఉంటారని వారు మీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. ఎటువంటి వివాదాలకు వెళ్లకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాలని ఆయన తెలిపారు. మీ భూ సమస్యలు, చిన్న చిన్న గొడవలు ఏవైనా ఉంటే వాటి పరిష్కారానికి అటు రెవెన్యూ, ఇటు పోలీస్ శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని ఆ సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తారని ఆయన తెలిపారు, అనంతరం ఆయన గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్ బాబు, ఏఎస్ఐ జాకీర్ హుస్సేన్, రెవిన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత సుభాష్ లెవెన్

కమలాపురం : స్థానిక సీఎస్ఐ చర్చి మైదానంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రొద్దుటూరుకు చెందిన సుభాష్ లెవెన్ విజేతగా నిలిచింది. అలాగే వల్లూరుకు చెందిన పీసీ లెవెన్ రన్నర్స్‌గా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.50వేలు సాయినాథశర్మ తన సొంత నిధుల ద్వారా అందజేశారు. అలాగే ద్వితీయ బహుమతి రూ.30వేలను మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి వితరణ చేయగా అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ సునీల్, దినకర్, సుధీకర్ బాబు, సురేంద్రబాబు పాల్గొన్నారు.

రూ.13 లక్షలకు వేలం పాట

సింహాద్రిపురం : అంకాలమ్మగూడూరులోని అంకాలమ్మ ఆలయంలో దేవస్థానానికి సంబంధించి ఒక సంవత్సరం టెంకాయల వేలం పాటను నిర్వహించారు. పులివెందులకు చెందిన శ్రీనివాసులరెడ్డి రూ.13 లక్షలకు వేలం పాట దక్కించుకున్నారు. వేలం పాటను ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

చెన్నూరు : మండల కేంద్రమైన చెన్నూరులోని చంద్రశేఖర్‌రెడ్డి కాలనీలో పొట్టిపాటి శంకర్ రెడ్డి, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి నివాస గృహంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు చెన్నూరు ప్రధాన రామాలయం భక్త రామదాసు స్వామి భక్త బృందంచే హనుమాన్ చాలీసా కీర్తనలు, భజనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు భక్తులు హనుమాన్ చాలీసా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్త రామదాసు స్వామి శిష్య బృందం పొట్టి పాటి శంకర్ రెడ్డి కుమారుడు పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డిని శాలువ కప్పి సన్మానం చేశారు.